ఉపాధ్యాయులు.. మార్గదర్శకులు

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబ్‌నగర్ : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 5 : గురువుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉందని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా ప్రభుత్వ అధికారుల సమీకృత భవన సముదాయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. 'నేను కలెక్టర్ అయినా.. ఇప్పటికీ టీచరమ్మ కూతురు' అనే అంటారన్నారు. మనం విద్యాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తే సత్ఫలితాలే వస్తాయన్నారు. ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు లైఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, రీడింగ్, రైటింగ్ స్కిల్స్, వ్యక్తిగత పరిశుభ్రత, పెద్దలను గౌరవించడం వంటివి నేర్పించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన నడవడికను అలవర్చుకునేలా చూడాలని, ప్రాథమిక దశలో పాఠశాలలో టీచర్లు చెప్పిందే విని అక్షరాలా పాటిస్తారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మహిళా ఉపాధ్యాయినులు ఎక్కువగా అవార్డులు అందుకున్నారని, వచ్చే సంవత్సరంలో మహిళలతో సమానంగా అవార్డులు సాధించేందుకు పోటీపడాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం 38మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమాల్లో జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో రవీందర్, డీఐఈవో ఉమామహేశ్వర్, సీఎంవో బైకని బాలుయాదవ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఆస్రాఖాద్రీ, ఉపాధ్యాయుడు చక్రవర్తిగౌడ్ పాల్గొన్నారు.

దేవరకద్ర మండలంలో..

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), సెప్టెంబర్ 5 : కౌకుంట్ల, చిన్నచింతకుంట మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నారాయణపేట మండలంలో..

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 5 : మండలంలోని కోటకొండ, జాజాపూర్, కొల్లంపల్లి, శేర్నపల్లి, సింగారంతోపాటు తదితర గ్రామాల పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మరికల్‌లో..

మరికల్, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అలాగే ధన్వాడ మండలంలోని సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఊట్కూరులో..

ఊట్కూర్, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ, తపస్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

దామరగిద్ద, సెప్టెంబర్ 5 : మండల కేంద్రంలోని సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయుడు నీలి రామప్పను జాజాపూర్‌కు చెందిన పోలీసు కానిస్టేబుల్ అంబ్రేష్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంభులింగం, ఎస్ఎస్ వాసు, వెంకట్‌రెడ్డి, శశిధర్ పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో..

మిడ్జిల్, సెప్టెంబర్ 5 : భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత గురువులదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీలలో ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజశ్రేయస్సు ప్రధాత ఉపాధ్యాయుడేనని అన్నారు. చాలామంది ఉపాధ్యాయులు ఆదర్శవంతంగా పనిచేస్తున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు నాయక్, కేజీబీవీ ఎస్‌వో కవిత, కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు సరస్వతి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, మండలాధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా సుధాకర్..

మిడ్జిల్, సెప్టెంబర్ 5 : జిల్లా స్థాయి ఉత్తమ ఉత్తమ ఉపాధ్యాయుడిగా హెచ్‌ఎంగా సుధాకర్ ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అయ్యవారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుధాకర్‌ను సన్మానించారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం

గండీడ్, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వెన్నాచేడ్‌లో విశ్రాంత గురువులను మాజీ వైస్ ఎంపీపీ ఈశ్వరయ్యగౌడ్ సన్మానించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో..

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఆర్ఎం శ్రీదేవి, డిపో మేనేజర్ సుజాత పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

మూసాపేటలో..

మూసాపేట, సెప్టెంబర్ 5 : మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు వాహిద్, సత్యనారాయణను సన్మానించారు.

భూత్పూర్‌లో..

భూత్పూర్, సెప్టెంబర్ 5 : మండలంలోని అన్ని ప్ర భుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో, తాటిపర్తిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూజలు చేశారు.

జడ్చర్లలో..

జడ్చర్ల, సెప్టెంబర్ 5 : బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. 60మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. స్మార్ట్ వండర్స్ పాఠశాలలో స్వయం పరిపాలన సోత్సవం నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, సెప్టెంబర్ 5 : మండల కేంద్రంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నవాబ్‌పేట మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు నర్సింహులు, ప్రేమ్‌సుధాకర్, బాలరాజు, శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో..

బాలానగర్, సెప్టెంబర్ 5 : బాలానగర్ బాలికల జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అల్లీపూర్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు, యువకులు

ఊట్కూర్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట : సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫోరం ప్రతినిధులు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

- నారాయణపేట ట్రైనీ కలెక్టర్ గరిమనరుల

అవార్డులు అందుకున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో ట్రైనీ కలెక్టర్ గరిమనరుల

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయవృత్తి ఎంతో పవిత్రమైనదని ట్రైనీ కలెక్టర్ గరిమనరుల అన్నారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ సమావేశ మందిరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా డీఈవో అబ్దుల్‌ఘని అధ్యక్షతన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు 44మందిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో మంచి పౌరులను తయారుచేసు బాధ్యత ఉపాధ్యాయులదని అన్నారు. అలాగే కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందేశాన్ని వినిపించారు. గురురాజారావు, శంకరాచారి, బీలంలాజర్, రామకృష్ణారెడ్డి, మంగళ, పురుషోత్తంబాబు, శ్రీనివాసులు, విభూషణ్, కిశోర్‌కుమార్, నాగరాజు, గోవిందు, అంబర్‌నాథ్, రేణుక, నర్సింహులు, చిన్న రాయుడు, సుభాషిణి, రాఘవ, నర్సింహాచారి, సురేఖ, నాందేవ్, జగదీశ్‌కుమార్, బాలమురళి, పద్మలతాదేవి, శ్రీనివాసులు, అంజనేయులురెడ్డి, చంద్రమౌళి, లతీపుద్దీన్, బాలరాజు, రఘువీర్, విశ్వనాథ్‌గౌడ్, రామాంజనేయులు, వనజ, వినోదిని, అంబిక, అఖిల్‌పాషా, హరి, మీర్‌లియాకుతుల్లా హుస్సేని, వెంకటప్ప, పుష్ప, గోపాల్, సౌజన్య, భీమప్ప, రమాదేవి, వెంకటేశ్ ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.

ఎమ్మెల్యే జీఎంఆర్‌కు పితృ వియోగం

దమగ్నాపూర్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), సెప్టెంబర్ 5 : దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి పితృవియోగం సంభవించింది. జీఎంఆర్ తండ్రి కృష్ణారెడ్డి(80) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం దమగ్నాపూర్‌లో మృతిచెందాడు. పలువురు నేతలు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే..

దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి గురువారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దమగ్నాపూర్‌కు చేరుకొని కృష్ణారెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, ఎస్సీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు మన్నె జీవన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

భూత్పూర్, సెప్టెంబర్ 5 : అన్నాసాగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీను తండ్రి రాజు ఇటీవల మృతిచెందడంతో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

నివాళులర్పిస్తున్న మహేశ్‌రెడ్డి

మృతిచెందడంతో నివాళులర్పించారు. అనంతరం వెంకట్‌రెడ్డిపల్లిలో మరో కార్యకర్త బోడి వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడనే విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే శేకప్పల్లికి చెందిన మహ్మద్ హజీమ్ గుండెపోటుతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు సలీం, నాయకులు బాలవర్ధన్‌రెడ్డి, జోగు కృష్ణ, అంజిలయ్య, వెంకటయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, సాయికుమార్, శివ, చందు పాల్గొన్నారు.

మహ్మదాబాద్, సెప్టెంబర్ 5 : అను నిత్యం ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దేశాయిపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త గంగరాజు చిన్నలాలయ్య

అప్రమత్తంగా ఉండాలి

మరికల్, సెప్టెంబర్ 5 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మురళి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు కనిపించినా, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించినా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో హెచ్ఎం నాగరత్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

మాగనూరు/కృష్ణ, సెప్టెంబర్ 5 : కృష్ణ రెవెన్యూ కార్యాలయంలో తాసీల్దార్ దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 30వ తేదీన సమాచార హక్కుచట్టంపై నిర్వహించనున్న అవగాహన సదస్సు కరపత్రాలు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నయ్య తదితరులున్నారు.

పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 5 : విద్యుత్ సంస్థల్లో యాజమాన్యాలు ఇచ్చిన పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యుత్‌భవన్ ఎదుట సంక్షేమ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. యాజమాన్యాలు ఇచ్చిన ఆర్డర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాన్సీక్వన్షియల్ సీనియారిటీని కొనసాగించాలన్నారు. ఆర్జిజన్ల డిమాండ్స్ కన్వర్షన్, ఏపీ ఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీచుపల్లి, చంద్రమౌళి, నారాయణ, తిరుపతయ్య, వెంకట్రాములు, రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తుకు నాంది

ఒప్పంద పత్రాలతో కేఎస్ రవికుమార్, మైమ్ మధు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 5 : దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు గురువులని సినీ నటుడు మైమ్ మధు (అర్షం మధుసూదన్) అన్నారు. గురువారం ధర్మాపూర్ సమీపంలోని జయప్రకాశ్‌నారాయణ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గురు పూజోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ మైమ్ అకాడమీ సంస్థ నుంచి మైమ్‌కు సంబంధించిన సబ్జెక్టు నేర్పించేందుకు జేపీఎన్‌సీఈతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్, ప్రిన్సిపాల్ సుజీవన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నపార్లలో వైద్యశిబిరం

ఊట్కూర్, సెప్టెంబర్ 5 : మండలంలోని చిన్నపార్ల రైతు వేదికలో గురువారం నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు శైలజారెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఫార్మసిస్ట్ సాయిబాబ, ప్రోగ్రాం ఆఫీసర్ సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్‌పై ఫిర్యాదు చేస్తాం

బాలానగర్, సెప్టెంబర్ 5 : రాజాపూర్ మండలంలో ఒక వర్గానికి కొమ్ముకాస్తున్న తాసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మండలంలోని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మాజీ ఎంపీపీ అన్నగళ్ల నర్సింహులు, మండలాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, మాజీ సర్పంచ్ బచ్చిరెడ్డి తదితరులు గురువారం రాజాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 3న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా కాకుండా పార్టీ కార్యక్రమంలా నిర్వహించారని ఆరోపించారు. ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తాసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

కెమిస్ట్రీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న పీజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకిరణ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 5 : పాలమూరు యూనివర్సిటీలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ విభాగంలో గురువారం స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కెమిస్ట్రీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

దామరగిద్ద, సెప్టెంబర్ 5 : మండలంలోని వివిధ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై డ్రై డేను ప్రభుత్వ దవాఖాన సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.కార్యక్రమంలో డాక్టర్ ఐశ్వర్య, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న సీఐ శివశంకర్

నారాయణపేట, సెప్టెంబర్ 5 : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హిందూ, ముస్లిం మతపెద్దలు, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉత్సవాలకు పటిష్టమైన పోలీస్ భద్రత కల్పిస్తామన్నారు.

ప్రతిఒక్కరూ సహకరించాలి..

ఊట్కూర్, సెప్టెంబర్ 5 : వినాయక చవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని తాసీల్దార్ చింత రవి, ఎస్సై కృష్ణంరాజు అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన శాంతి సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మత పెద్దలు హాజరయ్యారు. వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి పొందాలని సూచించారు. నిమజ్జనం రోజు నిర్వహించే ఊరేగింపుపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్, పీఏసీసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, జమీర్, లింగం, మక్బూల్, షమీ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

బాలానగర్, సెప్టెంబర్ 5 : గణేశ్ మండపాల ఏర్పాటుకు పోలీసుశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని బాలానగర్, రాజాపూర్ ఎస్సైలు తిరుపాజీ, రవి సూచించారు. ఈనెల 7వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణపతి నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్లో ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, పోలీసుల అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మరికల్/ధన్వాడ, సెప్టెంబర్ 5 : హిందూ, ముస్లిం పండుగలను ప్రశాంతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ పండుగలు స్నేహపూరిత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. అలాగే ధన్వాడ మండల కేంద్రంలో శాంతి సమావేశం నిర్వహించారు.

కఠినంగా శిక్షించాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 5 : కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ ఆడబిడ్డపై హత్యచారయత్నం, దాడిచేసిన మానవ మృగాన్ని శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీశ్యాంసుందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో తాసీల్దార్ అమరేంద్రకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

తాసీల్దార్‌కు వినతి..

నారాయణపేట రూరల్, సెప్టెంబర్ 5 : గిరిజన మహిళపై హత్యాచారయత్నానికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని గురువారం బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు లక్ష్మీశ్యాంసుందర్‌గౌడ్ ఆధ్వర్యంలో తాసీల్దార్ వెంకటకృష్ణకు వినతిపత్రం అందజేశారు.

సారా విక్రయించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

జడ్చర్ల, సెప్టెంబర్ 5 : భూత్పూర్ మండలం నల్లకుంటతండాకు చెందిన విస్లావత్ రాములు రెండు నెలల కిందట సారా విక్రయిస్తుండగా, పట్టుకున్న ఎక్సైజ్‌శాఖ పోలీసులు భూత్పూర్ తాసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి సారా విక్రయిస్తే రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. అయినా రాములు సారా విక్రయాన్ని కొనసాగిస్తున్నాడు. బుధవారం ఎక్సైజ్‌శాఖ పోలీసులు ఎస్‌హెచ్‌వో విప్లవరెడ్డి, ఎస్సై నాగరాజు తనిఖీలు చేయగా, 1.6 లీటర్ల నాటు సారా లభ్యమైంది. దీంతో ఎక్సైజ్ అధికారులు రాములకు రూ.లక్ష జరిమానా విధించారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

నారాయణపేట, సెప్టెంబర్ 5 : జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీట మునిగిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని బీకేఎస్ జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏవో జయసుధకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి వివరాలు సేకరించాలన్నారు.

పార్ట్ టైం టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 5 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో తొలగించిన పార్ట్ టైం ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సోషల్ వెల్ఫేర్ పార్ట్ టైం టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షులు భవాని, అంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అకస్మాత్తుగా ఎలాంటి కారణం చూపకుండా విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకొని తొలగించిన పార్ట్ టైం ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు.

డ్యూయల్ డెస్క్ బెంచీల వితరణ

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 5 : పట్టణంలోని వైదిక ఉన్నత పాఠశాలలో(ఎయిడెడ్) 1993-94 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు గురువారం పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.50వేల విలువ చేసే 15 డ్యూయల్ డెస్క్ బెంచీలను వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలగోపాల్, యోగేంద్ర, వెంకటేశ్, నారాయణ పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 5 : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్, మెట్టుగడ్డ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శాంతయ్య గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 1 ఆగస్టు 2024 నాటికి 14సంవత్సరాలు నిండి 8వ తరగతి, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియ